# ఓ హక్కుకోసం

అంపశయ్య నవీన్

అపర్ణ ఓ వారపత్రిక పేజీలు తిరగేస్తోంది. ఇంట్లో ఎవ్వరూ లేరు. అంతా నిశ్శబ్దం... పక్క ఫ్లాట్స్‌లో ఉదయం పదింటి దాకా వున్న సందడి ఇప్పుడు లేదు. ఎక్కడికి వెళ్లిపోవలసిన వాళ్లు అక్కడికి వెళ్లిపోయారు. అపర్ణమాత్రం ఎక్కడికీ వెళ్లడానికి వీల్లేదు. ఆ నాల్గుగోడల మధ్యలోనే ఉండిపోవాలి.

అపర్ణ తన చేతిలోని ఉన్న వారపత్రికను విసిరి కొట్టింది. దాంట్లో అచ్చయిన ఓ కథను సగం వరకు చదవగానే ఆ కథలోని ప్రధానపాత్రమీద ఆమెకు అసహ్యం కల్గింది. భర్త ఎంత చెడ్డవాడైనా, ఎంత నీచుడైనా, ఎంత క్రూరుడైనా అతనితో అడ్జస్టు కాకపోతే సమాజం తనను క్షమించదనుకుంటుంది ఆ పాత్ర. తన ఆత్మగౌరవాన్ని కోల్పోయి భర్తయినా సరే, మరెవ్వరైనా సరే వారికి దాస్యం చెయ్యడమంటే అపర్ణకు పరమ అసహ్యం. కాలేజిలో చదువుకునే రోజుల్లో అపర్ణ చాలా సార్లు స్త్రీ స్వాతంత్ర్యాన్ని గూర్చిన తన స్నేహితురాళ్లతో చాలా ఆవేశంగా మాట్లాడుతుండేది. వక్తృత్వపు పోటీలు జరిగినప్పుడల్లా వేదికలెక్కి ఉపన్యాసాలిస్తుండేది. స్త్రీ ఎట్టి పరిస్థితుల్లోనూ తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని పోగొట్టుకోవద్దని వాదిస్తుండేది.



"రేపు పెళ్లాయ్యాక కూడా నువ్విలాగే మాట్లాడతావా? భర్త మాటల్ని పెడచెవిన పెడ్తావా? అత్తమామలకు ఆడబిడ్డలకు ఎదురు చెప్పగల్గుతావా?" అంటూ ఆమె స్నేహితురాళ్లు ఆమెను అడుగుతుండేవాళ్లు.

"భర్తయినా సరే, మరెవరైనా సరే నా స్వేచ్ఛకు భంగం కల్గిస్తే నేను వాళ్లను క్షమించను" అంటుండేది అపర్ణ.

ఇటీవలనే అపర్ణకు పెళ్లయింది.

ఆమె భర్త అశోక్ ఎమ్.ఎస్‌సి. చేసిన తర్వాత పి.హెచ్‌డి కూడా చేసి యూనివర్సిటీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. చూడటానికి బావుంటాడు... మ్యానర్స్, మాటతీరు బావుంటాయి. మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. అన్నీ బావున్నాయి. ఈ సంబంధాన్ని వద్దనటానికి అపర్ణకు ఏ కారణమూ కనిపించలేదు.

అపర్ణకు కుడా గొప్ప అందగత్తె అన్న పేరుంది. ఆమెను మొదటిసారి చూసినవాళ్లెవరైనా సరే, ఆమెవైపు మరోసారి చూడకుండా ఉండలేరు. కొందరు యువకులైతే ఆమెను చూడగానే, 'వ్హాట బ్యూటీ!' అని కనుబొమ్మలెగరేస్తారు. అశోక్, అపర్ణ జంట అద్భుతంగా ఉంటుందని వాళ్ల దగ్గరి బంధువులందరూ అనుకున్నారు. ఈ సంబంధం కుదిరితే అపర్ణ కంటె అదృష్టవంతులెవరూ ఉండరని కూడా వాళ్ల బంధువులు అనుకున్నారు.

అందరూ అనుకున్నట్టుగానే అశోక్ అపర్ణను చూడగానే "అమ్మాయి నాకు నచ్చింద"ని చెప్పేశాడు. కట్నం, కానుకల విషయంలో పెద్ద సమస్యలేవీ ఉత్పన్నం కాలేదు. అశోక్ వాళ్ల నాన్న హెడ్‌మాస్టార్‌గా చేసి రిటైర్ అయ్యాడు. ఆయనకు ఆదర్శవంతుడైన ఉపధ్యాయుడన్న పేరుంది. "అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి నచ్చితే చాలు. కట్నం అనేది పెద్ద సమస్య కానే కాదు. మీ శక్తిమేరకు

ఎంతిచ్చినా చాలు" అన్నాడాయన.

అపర్ణ వాళ్ల నాన్న ఆర్ అండ్ బి కాంట్రాక్టర్. బాగానే సంపాదించాడని చెబుతారు. అతడు ఐదులక్షలు కట్నంగా ఇవ్వడానికంగీకరించాడు. బ్రాహ్మణోత్తములు "ఇది అత్యంత బలమైన ముహూర్తం" అని నిర్ణయించిన ముహూర్తానికి అశోక్, అపర్ణల పెళ్లి అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఐదారువేలమంది ఆహుతులు ఆ పెళ్లికొచ్చారు. అందరూ పెళ్లి ఎంత బాగా జరిగిందంటే ఎంత బాగా జరిగిందని చెప్పుకున్నారు.

అశోక్ హైదరాబాద్‌లో పని చేస్తున్నాడు కాబట్టి పెళ్లయిన నెలరోజుల్లోనే వాళ్లు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. ఓ టూ బెడ్‌రూం ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. ఆ ఫ్లాట్‌లోకి కావలసిన సోఫాసెట్టు, డెకోలామ్ మంచాలు, మ్యాట్రెస్‌లు, ఫ్రిడ్జ్, టీవీ, గ్యాస్‌స్టౌ మొదలైనవన్నీ అపర్ణవాళ్ల నాన్నే సమకూర్చాడు.

అపర్ణకు ఆ అపార్ట్‌మెంట్ చాలా నచ్చింది. భర్త యూనివర్సిటీ కెళ్లినప్పుడు అపర్ణ ఆ అపార్ట్‌మెంట్‌లో ఏ వస్తువు ఎక్కడుండాలో చాలా జాగ్రత్తగా సర్దేసి దాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దింది. అలా ఓ వారం రోజులు కష్టపడ్తే కాని ఆ అపార్ట్‌మెంట్ అంత శుభ్రంగా, అంత అందంగా తయారైంది.

అపర్ణకు కాపురం మొదలెట్టిన మొదటి వారం రోజులు చాలా హాయిగా గడిచిపోయాయనిపించింది. అశోక్ ఆమెను చాలా ప్రేమగానే చూసుకుంటున్నాడనిపించింది. ఆయన రోజూ ఉదయం తొమ్మిదింటికల్లా తయారై యూనివర్సిటీ కెళ్లిపోతుండేవాడు. అతడు వెళ్లిపోయేంత వరకు అపర్ణ ఆయనకు కావలసినవన్నీ అందిస్తూ చాలా బిజీగా ఉండేది. ఆయన మధ్యాహ్నం లంచ్ చెయ్యడానికి ఇప్పుడే భోజనం వండేసి లంచ్‌బాక్స్‌లో పెట్టేసి అతని బ్యాగ్‌లో పెట్టేది. అశోక్ మళ్లీ సాయంత్రం ఏడింటికి కానీ ఇంటికొచ్చేవాడు. అంతసేపూ అపర్ణ ఒక్కతే ఆ అపార్ట్‌మెంట్‌లో ఉండిపోయేది.

మొదట్లో ఇల్లు సర్దుకోవడంలో టైమ్ గడిచిపోయినా ఆ తర్వాత ఆమెకు టైమ్ ఎంతకూ గడిచేది కాదు. ఎన్ని మ్యాగజైన్స్ తిరగేసినా, ఎంతసేపు టీవీ ముందు కూర్చున్నా, ఎంతసేపు పడుకొని నిద్రపోయినా ఆమెకు టైమ్ గడిచేది కాదు. పడుకుంటే కాస్సేపట్లోనే మెలకువ వచ్చేది. మ్యాగజైన్స్ తిరగేస్తే కాస్సేపట్లోనే 'బోర్' అనిపించేది. ఎన్ని టీవీ ఛానల్స్ మార్చినా ఆమెకు దేనిమీదా ఇంటరెస్ట్ కల్గేదికాదు. అశోక్ ఇంట్లో ఉన్నంతసేపూ హాయిగానే గడిచేది. అతడు బయటకు వెళ్లిన మరుక్షణం నుంచి ఆమెకా ఇల్లు నరకంగా మారిపోతుండేది.

ఒకరోజు బెడ్‌మీద పడుకొని ఆలోచిస్తోంటే ఆమె బుర్రలోకి ఓ ఆలోచన వచ్చింది. తనూ చదువుకుంది. ఎం.ఏ. చేసి తర్వాత బి.ఇడి కూడా చేసింది. వెంటనే గవర్నమెంట్ జాబ్ రాకపోయినా, కొంచెం ప్రయత్నిస్తే హైదరాబాద్‌లో ఉన్న ఏ ప్రైవేట్ స్కూళ్లోనన్నా తనకు టీచర్ జాబ్ వస్తుందనిపించింది. తను ఏ స్కూళ్లోనన్నా టీచర్‌గా చేరితే టైమూ గడుస్తుంది. నాల్గు రాళ్లూ సంపాదించినట్టవుతుంది. బుర్రలోకి ఈ ఐడియా రాగానే ఆమె రెండు మూడురోజుల వార్తా పత్రికల్ని బయటకు తీసి "వాంటెడ్ కాలమ్స్" చూసింది. చాలా ప్రైవేట్ స్కూల్స్ వాళ్లు టీచర్స్ కావాలన్న ప్రకటనలిచ్చారు. వాటిని చూడగానే ఆమెకు చాలా ధైర్యం వచ్చింది.

MARUTI 800
MARUTI OMNI
MARUTI ALTO
MARUTI ZEN
MARUTI WAGANR
MARUTI VERSA
MARUTI GYPSY
MARUTI ESTEEM
MARUTI BALENO
MARUTI BALENO ALTURA

CHOICE IS YOURS - RESPONSIBILITY IS OURS

మా ఖాతాదారులకు,
శ్రేయోభిలాషులకు, ఆప్తమిత్రులకు
స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు.

MARUTI

NON STOP JOY
NON STOP MARUTI

స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలతో మీ



KONDA NIRANJAN REDDY
Executive Director





KONDA BALARAMI REDDY
Managing Director

BHARGAVI AUTOMOBILES (P) LTD
AUTHORISED MARUTI DEALER FOR SALES, SERVICE & SPARES
Industrial Estate, A.K. Nagar, NELLORE -4, Ph: 333336, 333337, 333338.

ఆరోజు అశోక్ యూనివర్సిటీ నుంచి రాగానే అతనికి కాఫీ కప్పు అందిస్తూ.

"మీరింట్లో లేనప్పుడు నాకు చాలా బోర్ కొడ్తోందండి" అంది అపర్ణ.

"ఇంట్లో బోల్డు మ్యాగజైన్స్ ఉన్నాయి. టీవీ ఉంది. బోల్డు ఇంటి పని ఉంది... అయిన బోర్ కొట్టడమేమిటి?" అన్నాడు అశోక్.

"నాకు టీవీ సీరియల్స్ పెద్దగా నచ్చవండి. అన్నిట్లోను పిచ్చి సెంటిమెంట్స్, కావాలని సాగదీయడం, మధ్యలో బోల్డు యాడ్స్... నాకస్సలు నచ్చవు" అంది అపర్ణ.

"టీవీ సీరియల్స్ నచ్చవా? ఇప్పుడు ఆడవాళ్లందరూ టీవీ సీరియల్స్ కోసం పడిగాపులు పడి చూస్తొంటే నీకేమో టీవీ సీరియల్స్ నచ్చవా? పెద్ద ఇంటలెక్చువల్‌గా ఫోజు కొడ్తున్నావే?" అన్నాడతను అపర్ణ కేసి ఈసడింపుగా చూస్తూ.

"నేనెలా ఇంటలెక్చువల్‌ని అవుతానులెండి. యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్వు కాబట్టి నువ్వే ఇంటలెక్చువల్‌వి. పోనీండి... దయచేసి నాదో మాట వినండి" అంది అపర్మ.

"సడన్‌గా ఏకవచనంలోకి దిగావేమిటి? భర్తను మీరు అన్నాలన్న విషయం కూడా తెలీదా నీకు"

"సారీ... సారీ... మనిద్దరి మధ్య చనువు పెరిగింది కదా.. అందుకే ఏకవచనం వచ్చేసింది... అవును మీరు నాకు భర్త కదా... మిమ్మల్ని మీరు అనాల్సిందే... సారీ" అందామె. ఏకవచనంతో ఆయన అంతగా పట్టించుకోవడం ఆమెను ఆశ్చర్యపరిచింది.

"ఓ.కె. ఓ.కె... ఇందాక ఏదో మాటన్నావు?"

"ఏం లేదు... ఊరికేనే ఇంట్లో ఉంటే పరమ బోరింగ్‌గా ఉంది. నేను బి.ఇడి కూడా చేశానన్న విషయం మీకు తెలుసు కదా.. ఏదన్నా ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా జాయిన్ అయిపోతే టైము గడుస్తుంది... నాల్గు రాళ్లు చేతిలో పడ్తాయి. ఏమంటారు?" అందామె అతడు 'నో' అనకూడదని ఆశిస్తూ...

అతడామెకేసి తీక్షణంగా చూశాడు.

"హాయిగా ఇంట్లో కూర్చుని ఎంజాయ్ చెయ్యమంటే నీకిలాంటి బుద్ధులు పుడ్తున్నాయేంటి? నువ్వు బజార్లో పడి ఉద్యోగం చెయ్యడం నాకిష్టం లేదు" అన్నాడతను.

"ఎందుకు? నేను ఉద్యోగం చెయ్యడం మీ కెందు కిష్టం లేదు" అందామె రోషంగా.

"నాకిష్టం లేదు. దట్సాల్... అంతకంటె ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు..."

"అవసరం ఉంది. ఎందుకిష్టం లేదో చెప్పండి" అందామె పట్టుదలగా.

"నువ్వు ఉద్యోగం పేరుతో బయటకు వెళ్లి పదిమంది దృష్టిలో పడటం నాకిష్టం లేదు. అందరూ నిన్ను ఈవిడ ఎంత అందంగా ఉందో అంటూ వాళ్ల పాపిష్టి కళ్లతో నీ అందాన్నంతా జుర్రెయ్యడం నాకిష్టం లేదు. అయినా ఉద్యోగం చెయ్యాల్సిన కర్మ నీకెందుకు? నిన్నూ, నన్నూ ఇద్దర్నీ హాయిగా ఉంచేటంత ఆదాయం నాకొస్తోంది. హాయిగా తిని ఇంట్లో కూర్చో. నేను బయటకెళ్లి ఇంటికి రాగానే చిరునవ్వుతో ఓ కప్పు కాఫీ ఇస్తే చాలు. నేను ఇంట్లో ఉన్నంతసేపు నన్ను కంటికి రెప్పలా కాపాడుకోవలసిన బాధ్యత నీది. నువ్వా బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తే చాలు... నువ్వే ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు"

అతని మాటలు ఆమెను అమితంగా ఆశ్చర్యపరచాయి. బాగా చదువుకున్నవాడు. ఎంతో సంస్కారవంతుడిలా కనిపిస్తాడు. చాలా సాఫిస్టికేటెడ్‌గా, సైంటిఫిక్‌గా ఆలోచిస్తాడనిపిస్తాడు. అలాంటి మనిషి ఇలా మాట్లాడటమేమిటి? భార్య బయటకు వెళ్తే అందరూ లొట్టలు వేసుకుంటూ ఆమెనే చూస్తూ ఆమె అందాన్నంతా వాళ్ల కళ్లతో జుర్రేస్తా రనుకోవడమేమిటి? ఎంత ఫ్యూడల్ థింకింగ్! ప్రజాస్వామ్య యుగంలో జీవిస్తున్న ఇతనికి ప్రజాస్వామ్య దృక్పథం ఏకోశానా లేదనిపించింది.

"మరి మీరు బయటకు వెళ్లినప్పుడు మిమ్మల్ని కంటికి రెప్పలా ఎవరు చూసుకుంటారో! నాకు మరో సందేహం... మీరు చాలా అందమైనవారే... మీరు బయటకు వెళ్లినప్పుడు మీవైపు కూడా ఎంతోమంది ఆవురావురుమని చూస్తూ మీ అందాన్ని కూడా వాళ్ల కళ్లతో జుర్రేస్తారేమోనని నేనూ బాధపడాలి కదా" అందామె.

"అపర్ణా! నువ్వు చాలా తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటున్నావు కదూ! ఆడదానికింత తెలివి అక్కర్లేదు. త్వరగా వంట చేసెయ్. డిన్నర్ చేసి సెకండ్‌షో సినిమాకెళ్దాం" అన్నాడతడు స్నానం చెయ్యడానికి బాత్‌రూం వైపు వెళ్తూ.

ఆమె మరోమాట మాట్లాడకుండా వంటగదిలోకెళ్లి పోయింది.

అప్పట్నించీ ఆమె అతన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించసాగింది. అతనితో కలిసి ఏ సినిమా చూడటానికో లేక ఏ చుట్టాలింట్లో జరిగే ఫంక్షన్‌కో వెళ్లొచ్చినప్పుడల్లా అతడు చాలా అనీజిగా, అశాంతిగా ఉంటున్నట్టు ఆమె గమనించింది. తనకేసి ఎవరన్నా ఈమె ఎంత అందంగా ఉందో అన్నట్టుగా చూస్తే చాలు, అతని వంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకుతున్నట్టుగా ఫీలయ్యేవాడు. ఆరోజు సినిమా చూసి ఇంటికి రాగానే...

"చూశావా! మనం బయటకు వెళ్లినప్పుడు నీకేసి ఎంతమంది రాస్కెల్స్ అదేపనిగా నిన్ను తినెయ్యాలన్నంత కసిగా చూశారో గమనించావా?" అన్నాడు అశోక్.

"కంటికి అందంగా కనిపించే వాళ్ల వైపు ఎవరైనా ఓ చూపు చూస్తారు. అది మానవ సహజం. దాన్ని మీరు ఇంతగా ఎందుకు పట్టించుకుంటారో నాకు అర్థం కాని విషయం" అంది అపర్ణ.

"అంటే... అంటే వాళ్లలా నీకేసి చూస్తుండిపోవడం నీకిష్టమేనన్నమాట!"


"నా యిష్టాయిష్టాలతో బయటి ప్రపంచానికి సంబంధం లేదండి. ఇట్ జస్ట్ హాపెన్స్! బయటి ప్రపంచంలో మీరు ఎవర్నని కంట్రోల్ చేస్తారు. సింప్లీ ఇగ్నోర్ చెయ్యడం బెటర్ అంటున్నాను"

"నా భార్యను... నా అర్ధాంగిని, బజార్లో ఉన్న ప్రతి అడ్డమైన వెధవ కళ్లప్పగించి చూస్తొంటే పట్టించుకోకుండా ఎలా ఉంటాను? దీనికి పరిష్కారం ఒక్కటే... నిన్నసలు బయటకు రానీయకుండా ఇంట్లో ఉంచడమే..."

"అంటే... నన్ను 24 గంటలూ ఈ నాల్గు గోడల మధ్యనే ఉండి పొమ్మంటారా? ఆర్యూ జోకింగ్?"

"నో... అయామ్ నాట్ జోకింగ్. నువ్వు చాలా అందంగా ఉన్నావు కాబట్టి నీ కీ శిక్ష తప్పదేమో" అన్నాడతడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"నువ్వు... సారీ మీరూ చాలా అందంగానే ఉంటారు కదా... మరి



మీకేమిటి శిక్ష?"

"నేను మొగాన్ని మైడియర్ వైఫ్!"

"నన్నెంతమంది చూసినా నాకూ ఏమీ కాదు... నా అందం తరిగిపోదు... అరిగిపోదు... ఆవిషయం మీరు గుర్తిస్తే మంచిది"

"లేదు... నువ్వు నన్ను అర్థం చేసుకోవడం లేదు... నీ అందాన్ని ఎంజాయ్ చేసే హక్కు ఈ ప్రపంచంలో నాకు తప్ప మరెవ్వరికీ లేదు..."

"మీరింత ఫ్యూడల్ మైండ్‌సెట్ అని నేను కలలో కూడా ఊహించలేదు" అందామె అతనికేసి చాలా ఆశ్చర్యంగా చూస్తూ.

"నీకు ఇంగ్లీషు బాగానే వచ్చే! ఫ్యూడల్ మైండ్ సెట్ అంటే ఏమిటో కాస్త తెలిసేట్టు చెబుతావా?"

"చెప్పను..."

"ఎందుకు చెప్పవు?"

"చెప్పినా ప్రయోజనం ఉంటుందన్న ఆశ కనిపించడం లేదు కాబట్టి"

అతడు పెద్దగా నవ్వుతూ చప్పట్లు కొట్టాడు.

"నా వైఫ్ ఇంత తెలివైనది. నిన్ను చూసినప్పుడనుకోలేదు... నిన్ను మొదటిసారి చూసినప్పుడు నువ్వు చాలా అమాయకురాలివనుకున్నాను... అందుకే నిన్ను చేసుకోవడానికి వెంటనే అంగీకరించాను. అప్పుడే నువ్వింత తెలివైనదానివని తెలిస్తే..."

"నిన్ను చూసినప్పుడు.... సారీ మిమ్మల్ని చూసినప్పుడు నాకేం అభిప్రాయం కల్గిందో చెప్పమంటారా?"

"చెప్పు..."

"చెబితే నొచ్చుకుంటారేమో!"

"నొచ్చుకోను... ఐ లైక్ ఫ్రాంక్‌నెస్... భార్యాభర్తల మధ్య రహస్యాలుండకూడదు..."

"రియల్లీ...?"

"రియల్లీ..."

"అయితే వినండి. మీరు గొప్ప సంస్కారవంతులనుకున్నాను. ఎం.ఎస్‌సి. కెమిస్ట్రీ చదివారు కాబట్టి చాలా సైంటిఫిక్‌గా ఆలోచిస్తారనుకున్నాను. ప్రజాస్వామ్యయుగంలో ఉన్నాం కాబట్టి చాలా డెమొక్రాటిగా ప్రవర్తిస్తారనుకున్నాను"

"అయితే ఇప్పుడేమయ్యింది?"

"ఏమీ కాలేదు..."

"నేను సంస్కారవంతున్ని కానంటావు. సైంటిఫిక్‌గా ఆలోచించడం లేదంటావు? డెమొక్రాటిగా ప్రవర్తించడం లేదంటావు... హౌ డేర్..." అంటూ అతడు ఆమె మీదకు రాబోయాడు. అతనికి చాలా కోపమొచ్చిందని ఆమెకర్థమయ్యింది.

"సారీ ఇఫ్ ఐ హర్ట్ యూ... " అంటూనే ఆమె అక్కన్నించి వెళ్లిపోయింది. అతడామెను అనుసరించాడు. వాళ్లు వాళ్ల బెడ్‌రూంలో ప్రవేశించారు.

"నాకు కావల్సింది నీ సారీ కాదు... నీ సమాధానం... నేను సంస్కారవంతున్ని..."

"చాలా పొద్దుపోయింది... నాకు నిద్ర ముంచుకొస్తోంది... మీరు చాలా సంస్కారవంతులే. నేనే మిమ్మల్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు... మరోసారి 'సారీ' చెబుతున్నాను. ఆ టాపిక్‌నిక వదిలెయ్యండి" అందామె పక్కమీదకు వాలిపోతూ.

"ఓ.కె. ఓ.కె. రెండుసార్లు సారీ చెప్పావు కాబట్టి వదిలేస్తున్నాను..." అంటూ అతడు బట్టలు మార్చుకొని ఆమె పక్కన చేరిపోయాడు.

కాస్సేపు ఇద్దరిమధ్య నిశ్శబ్దం.

ఆమె నిద్రపోతున్నదని అతనికర్థమైంది.

"నిద్ర పోతున్నావా డార్లింగ్!" అన్నాడతడు ఆమెమీద చెయ్యేసి చాలా ప్రేమగా.


ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం

**ముత్యాలసరాలు** **ఫలం - నిష్ఫలం**

అతడు పైకి సామ్యంగా కనిపిస్తాడు. చూపుల లోతులు చూస్తే మాత్రం అండ పిండ బ్రహ్మాండాలను అరచేతిలో ఇముడ్చుకున్నాడా అనిపిస్తుంది. ఒకరోజు, చుట్టూ గుమిగూడిన జనానికి ఓ కథ చెప్పాడు.

గింజలు చల్లడానికి వెళ్ళిన రైతుకథ. దారి పక్కన పడ్డ గింజలు పక్షుల పాలయ్యాయి. మట్టి లోతుగా లేని రాతి నేల మీద పడ్డవి వేరు లోతుగా పారక మొలిచినట్టే మొలిచి సూర్యరశ్మి వేడికి వాడిపోయి, ఎండిపోయాయి. ముళ్ల మొక్కల్లో పడ్డ వాటిని అవి పెరగనివ్వలేదు. కొన్ని గింజలు మాత్రం సారవంతమైన నేలమీద పడ్డాయి. కుప్పలు తెప్పలుగా పండింది పంట.

ఎవరికి ఎంతవరకు అర్థమైందో గానీ, శిష్యులకు మాత్రం అంతరార్థం ఆయనే విప్పి చెప్పాడు. రైతు, దైవ వార్తాహరుడు. గింజలు దైవసందేశాలు. గింజలు పడ్డ స్థలాలు మానవ హృదయాలు. కొందరు దారిన పోతూ విన్నట్టుగా వింటారు. దుష్ట స్నేహితులనే పక్షులు ఆ మాటలను నాటుకోనివ్వవు. కొందరు సందేశాలు వింటారు, మెచ్చుకుంటారు. ఇక నుండి మంచిగా ఉంటామని నిర్ణయించుకుంటారు. మాటలు నాటుకున్నా మట్టిలో లోతులేక వేరు పారదు. మరొక రకం మనుషులుంటారు. స్వామి నారి సందేశాలు వింటారు. అవతలకు వెళ్ళగానే సంసార సాగరం వారిని ముంచేస్తుంది. ముళ్ళ మొక్కల్లో పడతారు. మత్తుగా పడుకునే గొంగళి పురుగులు చిరిగిన కోట్లున్న కోటీశ్వరరావులు. వీపున పాపాల మాటలున్న వీరేశ్వరావులు. యోగీశ్వరుల్లా నటించే జోగీశ్వరరావులు. నిరుపయోగంగా చనిపోయే నీరేశ్వరరావులు. ముళ్ళ పొదలు మొక్కల్ని తొక్కేస్తాయి. సత్య సందేశాలకు సత్ఫలితాలు శూన్యం.

ఇక ఉత్తములుంటారు సుసందేశాలు సూటిగా నాటుకుంటాయి. బ్రతుకు బాటను మార్చుకుంటారు. కుంచెడు మంచి మాటల గింజలు సంచుల కొద్దీ ధాన్యాన్ని పండిస్తాయి. ముప్పయి, అరవై, నూరంతల పంట. సత్సందేశాలు కొందరికి ఫలం, కొందరికి నిష్ఫలం.

ఈలోకోత్తర సందేశాన్ని అందించిన వాడు యేసుక్రీస్తు చిన్నరైతన్న సామ్యంలో చిదంబర రహస్యాలు. ఇందులో పాపపుణ్యాల ప్రసక్తి ఉంది. నీతిమాటల లోతులున్నాయి. ఇలాంటి బోధలు కోకొల్లలుగా ఉన్న పుస్తకం బైబిల్లో భాగమైన 'కొత్త నిబంధన' గ్రంధం. క్రైస్తవేతరులకు చక్కగా బోధపడే సులభ శైలిలో వెలువడింది. 564 పేజీలు, పోస్టుకార్డు మీద వ్రాస్తే చాలు, మీ చిరునామాకు ఉచితంగా పంపిస్తాం.

ఇదీ మా అడ్రసు

**నిరీక్షణ**

పోస్టు బాక్సు నెం. 608
సీతమ్మధార, విశాఖపట్నం - 530 013. ఆంధ్రప్రదేశ్

ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం

ఆమె అతని చేతిని తీసేసింది.

"కోపమొచ్చిందా డార్లింగ్?" అంటూ అతడామెను తనవైపుకు తిప్పుకోబోయాడు.

"నాకు నిద్ర ముంచుకొస్తోంది. దయచేసి ఈ రోజుకు వదిలెయ్యండి" అందామె అతన్నుండి తప్పించుకొని, అతనికి కొంచెం దూరంగా జరిగింది.

"కోపమొచ్చిందా అపర్ణా?"

"నాకే కోపమూ లేదు"

"అబద్ధమాడుతున్నావు... నీకు నామీద కోపమొచ్చింది"

"ఎందుకు?"

"ఎందుకో నీకు తెలుసు... నాకు తెలుసు...'

"అయితే...?"

"భార్యాభర్తలన్నాక ఈమాత్రం పోట్లాడుకోకపోతే ఏం బావుంటుంది. వియ్ హేడ్ జస్ట్ సమ్ ఫన్! అంత మాత్రానికే నువ్విలా స్ట్రైక్ చెయ్యాలా?"

"నేనే స్ట్రైక్ చెయ్యడం లేదు. దయచేసి నన్నొదిలెయ్యండి"

"వదిలే ప్రసక్తే లేదు. ఐ వాంట్ యూ" అంటూ అతడామెను బలవంతంగా తనవైపు తిప్పుకొని బలంగా కౌగలించుకున్నాడు. ఆమె అతని బలమైన చేతుల్లోంచి బయట పడాలని తన శక్తికొద్దీ పెనుగులాడింది.

"ప్లీజ్ అపర్ణా! ప్లీజ్! కావాలంటే సారీ చెబుతాను. నువ్వు సారీ చెప్పినప్పుడు నేను నిన్ను క్షమించాను కదా... నేనూ సారీ చెబుతున్నాను. ప్లీజ్ ఎక్స్‌క్యూజ్‌మీ... అండ్ ప్లీజ్ కోఆపరేట్" అంటూ అతడామెను పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు.

తనిక పెనుగులాడి ప్రయోజనం లేదనీ, అతడికిక తన శరీరాన్ని అప్పగించక తప్పదని ఆమెకర్థమైంది. అతడు తన భర్త. భర్తగా అతడు తనను బలవంతంగానైనా అనుభవించవచ్చునని సమాజం అతనికి లైసెన్స్ ఇచ్చింది. తను ఎంత ప్రతిఘటించినా లాభం లేదు. ఆమె నిశ్శబ్దంగా అతనికి స్వాధీనమైపోయింది.

అతడామె శరీరాన్ని పూర్తిగా ఆక్రమించుకున్నాడు. అతనికి స్వర్గలోకపుటంచుల్లోకి వెళ్లిపోతున్నట్టుగా ఉంది. హిమాలయశిఖరాల్ని అధిరోహిస్తున్నట్టుగా ఉంది. అతని శరీరమంతా తేలికగా దూదిపింజెలా మారిపోయి గొప్ప హాయిని అనుభవిస్తోంది. ఆమె కళ్లు మూసుకొని అచేతనంగా ఉండిపోయింది. ఆమెకు తన శరీరం తన శరీరం కాదన్నట్టుగా తోచింది. ఐదారు నిమిషాల తర్వాత అతడామె నుండి విడిపోతూ "థాంక్యూ డార్లింగ్" అన్నాడు.

ఆమె తనలో తాను నవ్వుకుంది.

కొద్ది క్షణాల్లోనే అతని గురక వినిపించసాగింది.

అతడు గాఢ నిద్రలోకి వెళ్లిపోయాడని ఆమెకర్థమైంది.

కానీ ఆమెకు నిద్ర రాలేదు. ఈ సృష్టికార్యమనేది ఇంత ఏకపక్షంగా ఉంటుందని ఆమె ఊహించలేకపోయింది. అతనికి తన శరీరం తప్ప తన మనస్సుతో నిమిత్తం లేదు. ఆ పనిలో తనుకూడా పాలు పంచుకుంటున్నదా లేదా అన్న విషయం అతనికక్కర్లేదు. అతడు ఆనందిస్తే చాలు, అతడు తన నరాల వొత్తిడిని తీర్చుకుంటే చాలు.... స్వర్గ సుఖాలనుభవిస్తే చాలు. తనతో అతనికి నిమిత్తం లేదు... ఇంచుమించు రోజూ ఇదే తంతు... ఆ పనంటేనే ఆమెకు అసహ్యం కల్గేలా అతడు ప్రవర్తించేవాడు.

000

అపర్ణ టైము చూసింది....పదకొండున్నర. సాయంత్రం ఏడు దాటితేగాని ఆయన రాడు. తను ఒంటరిగా ఇంకా ఎనిమిదిగంటలు గడపాలి. కాస్సేపు టీవీ చూద్దామని టీవీ ఆన్ చేసింది. ఏదో మాయలు, మంత్రాలు, క్షుద్రవిద్యలతో కూడిన సీరియల్ వస్తోంది. వెంటనే ఛానెల్ మార్చింది. అత్తాకోడళ్ల గొడవతో వస్తున్న సీరియల్... కాస్సేపు చూసి మరో ఛానెల్... ఏదో హిందీ సీరియల్... ఏడెనిమిది ఛానెల్స్ మార్చి దేనిమీద మనస్సు నిలవలేక టీవీ ఆఫ్ చేసి పుస్తకాల షెల్ఫ్‌లోంచి ఓ పుస్తకాన్ని బయటకు తీసింది. అది స్త్రీవాద రచయిత్రిగా పేరుపొందిన ఓ ప్రముఖ రచయిత్రి రాసిన నవల. ఆ నవలను ఆమె ఇదివరకే రెండుమూడు సార్లు చదివింది. అక్కడక్కడ తనకు బాగా నచ్చిన భాగాల్ని మళ్లీ చదవడం మొదలెట్టింది. అశోక్ తన నొసారి ఈ పుస్తకం చదువుతోంటే చూసి "ఇలాంటి చెత్త పుస్తకాలు చదివితే సంసారాలు నాశనమైపోతా"యన్నాడు. ఇట్లాంటి పుస్తకాలు నా ఇంట్లో ఉండటానికి వీల్లేదు బయటకు విసిరెయ్యబోయాడు. తను ఆ పుస్తకాన్ని అతని చేతుల్లోంచి తీసుకొని దాచేసింది. కాస్సేపా పుస్తకాన్ని అక్కడక్కడ చదివి, పక్కన పెట్టేసి బెడ్‌రూంలోకెళ్లి పక్కమీద వాలిపోయి కాస్సేపు అటుఇటూ దొర్లుతూ ఆలోచించసాగింది.


ఇదేమిటి? తనిలా మారిపోతున్నదేమిటి? అతడు ఉద్యోగం చెయ్యొద్దంటే చెయ్యకుండా ఊరుకోవడమేనా? బయటకు వెళ్లకుండా ఇరవైనాల్గంటలూ ఈ నాల్గు గోడల మధ్య బందీ అయిపోమ్మంటే అయిపోవడమేనా? స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ స్వేచ్ఛ అంటూ కాలేజి రోజుల్లో గొంతు చించుకున్న తనేనా ఇలా మారిపోతున్నది! అతనితో పోట్లాడితే అతడు నువ్వు నాకొద్దంటాడు. పుట్టింటికెళ్లిపోతే అమ్మా, నాన్న "ఎంత పని చేశావే?" అంటూ గుండెలు బాదుకుంటారు. సమాజంలో వాళ్ల కీర్తిప్రతిష్ఠలు మంట గలిసిపోయినట్టుగా ఫీలవుతారు. మళ్లీ ఎన్నో బుద్ధులు చెప్పి, క్షమించమని అతని కాళ్లు పట్టుకుని, తనను మళ్లీ అతనికే అప్పగిస్తారు... ఇవన్నీ ఆలోచించే తను అతనితో అడ్జస్ట్ కావడానికి ప్రయత్నిస్తోంది. కానీ ఈ అడ్జస్ట్‌మెంట్ ఎంతకాలం సాగుతుంది? తన గుండెలు మండిపోతోంటే వాటిని ఎంతకాలం చల్లార్చగల్గుతుంది? ఇది తన సహనానికి పరీక్ష...

బయటెవరో కాలింగ్‌బెల్ నొక్కారు. ఎవరో వచ్చినట్టుంది. ఈ టైమ్‌లో ఎవరొస్తారబ్బా? అనుకుంటూ ఆమె వెళ్లి తలుపులు తీసింది. బయట అశోక్ నిల్చొని ఉన్నాడు.

"హాయిగా నిద్రపోతున్నట్టున్నావే... డిస్టర్బ్ చేశానా?" అంటూ అతడు లోపలకొచ్చి చేతిలోవున్న బ్యాగ్ ఓ పక్కన పడేసి షూస్ విప్పుకోసాగాడు.

"మీరు... ఈ టైమ్‌లో..." అందామె ఆశ్చర్యంగా

"రాకూడదా? సర్‌ప్రైజ్ అయ్యావా? ఈ రోజు మా యూనివర్సిటీలో ఎం.ఏ. చదువుతున్న ఓ అమ్మాయి సూసైడ్ చేసుకుందిట. ప్రేమగొడవ ఆమె ప్రేమించిన అబ్బాయితో పెళ్లి చెయ్యడానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోలేదట. దాంతో ఈ అమ్మాయి స్లీపింగ్ పిల్స్ మింగేసి చనిపోయిందట. అందువల్ల ఈరోజు



మాకు హాలిడే ఇచ్చారు. మా కొలీగ్స్ కొందరు ఏదన్నా సినిమాకెళ్దామన్నారు. పాపం... నువ్వొక్కదానివే ఇంట్లో ఉంటావు కదా... ఈ రోజైనా నీతో కాస్సేపు హాయిగా గడుపుదామని స్ట్రెయిట్‌గా ఇంటికే వచ్చేశాను" అన్నాడతడు ఆమె భుజాలమీద చేతులు వేసి.

ఆమె నవ్వింది "ఈ దీనురాలిమీద ఎంత దయ కల్గిందో" అందామె.

"అట్లా మాట్లాడకు డార్లింగ్! నువ్వంటే నాకెంత ప్రేముందో నీకు తెలీదు... ఐ లవ్ యూ డార్లింగ్! ఐ లవ్ యూ విత్ ఆల్ మై హార్ట్ అండ్ సోల్" అన్నాడతడు ఆమెను తన బాహువుల్లో బంధించబోతూ

"తెలుసు" అందామె అతన్ని తప్పించుకొని.

"తెలుసా? నిజంగా తెలుసా?"

"నిఝంగా తెలుసు"

ఇంతలో బయట ఎవరో కాలింగ్ బెల్ నొక్కారు. కాలింగ్‌బెల్ మోగింది.

ఇద్దరూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

అతడే వెళ్లి తలుపులు తీశాడు.

బయట పోస్ట్‌మ్యాన్ నిల్చొని వున్నాడు.

"రిజిస్టర్డ్ లెటర్ సార్! అపర్ణ పేరు మీదొచ్చింది" అన్నాడు పోస్ట్‌మాన్.

"ఇటివ్వు" అంటూ అతడే సైన్ చేసి ఆ లెటర్ తీసుకొని లోపలకొచ్చి తలుపులు మూసేసి ఆ కవరు చించబోయాడు.

"ఆ లెటర్ నాకొచ్చింది. దాన్ని మీరు చించడమేమిటి? దయచేసి నా లెటర్ నాకిచ్చెయ్యండి" అందామె.

"నేను చించితే ఏమవుతుంది?"

"ఏమీ కాదు... కానీ ఎవరికొచ్చిన లెటర్ని వాళ్లకివ్వడం న్యాయం"

"దీంట్లో పెద్ద అన్యాయమేమీ లేదు. భార్యకొచ్చిన లెటర్స్ భర్త చదవొచ్చు..."

"భార్య చదవమంటేనే చదవాలి"

"అంటే ఈ ఉత్తరం చదవడానికి నీ పర్మిషన్ కావాలంటావు... పోనీయ్ పర్మిషన్ ఇవ్వు."

"ఇవ్వను... నా లెటర్ని నేనే మొదట చదవాలి. తర్వాత కావాలంటే మీరూ చదువుదురు గానీ..."

"నథింగ్ డూయింగ్. ఈ ఉత్తరాన్ని మొదలు నేనే చదవాలి... భార్యకొచ్చిన ఉత్తరాల్ని చదివే హక్కు భర్తకుంటుంది"

"ఉండదు గాక ఉండదు... వేరే వాళ్లకొచ్చిన ఉత్తరాల్ని మనం చదవడం సంస్కారమనిపించుకోదు"

"స్వంతభార్య వేరే వాళ్లెలా అవుతుంది"

"స్వంత భార్యయినా సరే... ఆమెకుండే ప్రైవసీ ఆమెకుంటుంది"

"అదంతా నాకు తెలీదు. నేనీ ఉత్తరాన్ని చదివాకే నీకిస్తాను"

"అలా వీల్లేదు. ఆ ఉత్తరం నాకొచ్చింది. దాన్ని నా క్లోజెస్ట్ ఫ్రెండ్ విశాల రాసినట్టుంది. ఇంకెంతోసేపు రాద్ధాంతం చెయ్యకుండా దయచేసి నా ఉత్తరాన్ని నాకిచ్చెయ్యండ"

"ఇవ్వను.. ఆ విశాలంటే ఎవరో, ఆమె నీకేం రాసిందో నాకు తెలియాలి. తెలుసుకునే హక్కు నాకుంది... ఇంతకూ విశాలంటే స్త్రీయేనా? లేక పురుషుడా? అతడు నీ బోయ్‌ఫ్రెండ్ కాదు కదా! ఆ విషయం కూడా ఈ ఉత్తరం నేను చదివితేనే తెలుస్తుంది"

"అసహ్యంగా మాట్లాడకండి... నా ఉత్తరాన్ని


వివాహ వేడుకలతో ప్రతిక్షణం ఆనందాలు
స్వగృహఫుడ్స్‌తో సరికొత్త సంబరాలు

ESTD. 1990

స్వగృహఫుడ్స్ ®



Attractive Gift Packs

Delicious Bengali, Dry Fruits, Cashew, Badam Sweets, Pickles, Chilly Powders.

We do U.S.A. Packings also

అద్భుత రుచులను ఆస్వాదించడంలో అసలైన అనుభూతి. సరికొత్త రుచులందించటంలో ఖ్యాతి

SWAGRUHA® FOODS

PIOEERS IN HOME FOODS

బందరురోడ్
విజయవాడ—10
ఫోన్: 475763, ఫ్యాక్స్: 480200

10/1. అరండల్‌పేట
గుంటూరు
ఫోన్: 235350

మాకు పై అడ్రస్సులనందు తప్ప బ్రాంచీలు లేవు

నాకిచ్చేయండి... అది రిజిష్టర్డ్ లెటర్... వాంటెడ్ కాలమ్స్‌లోని ఏదో ప్రెస్ కట్టింగ్ పంపించినట్టుంది. ఏవైనా మంచి ఉద్యోగాలు వస్తే నాకు ఇన్‌ఫామ్ చెయ్యమని నేను దానికి చెప్పాను"

"అదే తెలుసుకొందాం... వాంటెడ్‌కాలమ్స్ పంపించిందో... ఇంకేం పంపించిందో నేనూ చూస్తాను. నేనా కవర్ని తెరచినందువల్ల నీకొచ్చే నష్టమేమిటో నాకర్థం కావడం లేదు"

"లాభనష్టాల విషయం కాదు... అది నాకొచ్చిన ఉత్తరం... దాన్ని ముందు నేనే చదవాలి. దట్స్ మై రైట్... దాన్ని కాదనే హక్కు ఈ ప్రపంచంలో ఎవరికీలేదు" అంటూనే ఆమె అతని చేతిలో ఉన్న ఉత్తరాన్ని బలవంతంగా లాక్కోబోయింది. అతడు ఆ ఉత్తరాన్ని మరో చేతిలోకి మార్చుకున్నాడు.

"నేను నీకీ ఉత్తరాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వను. దీంట్లో ఏదో రహస్యం ఉంది. అందుకే నువ్వింత రాద్ధాంతం చేస్తున్నావు. ఆ రహస్యమేమిటో నేను తెలుసుకొని తీరాలి"

"ఎట్టి పరిస్థితుల్లోనూ నా ఉత్తరాన్ని మిమ్మల్ని మొదట చదవనీయను... ప్లీజ్! నా ఉత్తరాన్ని నాకిచ్చెయ్యండి" అంటూనే ఆమె అతని చేతిమీద తన చేతిగోళ్లతో రక్కి అతన్నుండి ఆ కవర్ని తీసుకోబోయింది. అతని వేళ్లు చిట్లి రక్తం కారింది.

"నన్ను... నన్ను... నీ భర్తను రక్తం వచ్చేట్టు రక్కుతావా? యూ బ్లడీ బిచ్" అంటూ అతడు ఆమె చెంప ఛెళ్లుమనిపించాడు. ఆ దెబ్బకు ఆమె చెంప మీద నిప్పులు కురిశాయి. ఆమె చెంప కందిపోయింది. మరుక్షణంలో ఆమె కన్నుల్లోంచి కన్నీళ్లు ఉబికివచ్చాయి.

"నన్ను... నన్ను... నీ భార్యను... నా సర్వస్వాన్నీ నీకర్పించినదాన్ని... నా వాళ్లందర్నీ వదిలేసి నీతో వచ్చినదాన్ని... నన్ను కొడ్తావా?" అంటూనే ఆమె దెబ్బతిన్న పులిలా అతని మీద పడి అతని మూతిమీద బలంగా గుద్దింది. అతని పెదవి చిట్లి రక్తం కారింది. దాంతో అతడు విపరీతంగా రెచ్చిపోయాడు.

"అందునా ఆడదానివి... నన్ను దెబ్బకు దెబ్బ కొడ్తావా?" అంటూనే ఆమె మీద పడి ఫెడీఫెడీమని ఎక్కడపడ్తే అక్కడ అతని శక్తికొద్దీ కొట్టసాగాడు. ఆమె కూడా అతడు కొడ్తున్న దెబ్బల్ని నిస్సహాయంగా స్వీకరించడం కాకుండా ప్రతిఘటించి దెబ్బకు దెబ్బ తీస్తూనే ఉంది. ఇద్దరి శరీరాల నుండి రక్తాలు కారాయి. వాళ్లేం చేస్తున్నారో వాళ్లకు తెలీడం లేదు. ఇద్దర్నీ పిచ్చి ఆవేశం ఆవహించింది. కాస్సేపట్లోనే ఇద్దరూ అలసిపోయారు... అతనికి మెల్లగా జరిగిందేమిటో అర్థం కాసాగింది.... తనూ హద్దులు మీరాడు. తను హద్దులు మీరితే ఆమె... ఆఫ్టరాల్ ఓ వుమన్... హద్దులు మీరి తనమీద చెయ్యి చేసుకుంటుందా? అతనికి ఇద్దరు పెనుగులాడుతున్నప్పుడు కిందపడ్డ ఆ కవర్ కనిపించింది. వెంటనే దాన్ని అతడు తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఈ ఉత్తరం కోసమే కదు నువ్వింత తెగించి నాతో పోట్లాడావు... దెబ్బకు దెబ్బ తీశావు... దీన్ని ముక్కలు ముక్కలుగా చించేస్తున్నాను... ఏం చేస్తావో చెయ్యి" అంటూనే అతడా ఉత్తరాన్ని చించేయబోయాడు. మరుక్షణంలో నేలమీద పడిపోయిన ఆమె దిగ్గున లేచి అతనిమీద పడి అతని చేతిలో వున్న ఉత్తరాన్ని తన చేతిలోకి తీసుకొని జాకెట్లో దోపుకుంది. అతడు ఓడిపోయినట్టుగా, నిస్సహాయంగా ఆమెకేసి కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. ఓక్షణం అలా నిల్చొని... ఎట్టి పరిస్థితుల్లోనూ నువ్వా ఉత్తరాన్ని నాకన్నాముందు చదవడానికి వీల్లేదు... నిన్ను నరికేసయినా సరే నేనా ఉత్తరాన్ని నీ దగ్గర్నుంచి తీసుకుంటాను" అంటూ అతడామెవైపు రాబోయాడు.

"ఆగు! అక్కడే ఆగు... ఒక్క అడుగు ముందుకు వేశావంటే నేనేం చేస్తానో నువ్వూహించలేవు" అందామె డైనింగ్ టేబుల్ మీదున్న ఓ స్టెయిన్‌లెస్ వంటపాత్రను చేతుల్లోకి తీసుకొని.

ఆ క్షణంలో ఆమెను చూస్తే అతనికి భయమేసింది. వెంట్రుకలు విరబూసుకుని, రక్తం నిండిన కళ్లతో తనకేసి తీక్షణంగా చూస్తున్న ఆమెను చూస్తే అతనికి కాళిమాత గుర్తొచ్చింది.

"నువ్వు నా ఇంట్లో ఒక్కక్షణం కూడా ఉండటానికి వీల్లేదు... ఈ క్షణమే బయటకు వెళ్లిపోవాలి... గెటౌట్" అతడు శక్తికొద్దీ అరిచాడు.

"ఇది నీ ఇల్లా? నీ ఇంట్లో ఉన్న ప్రతి వస్తువూ నేను తెచ్చుకున్నదే. ఈ ఇంటిని ఇంత అందంగా తీర్చిదిద్ది దీన్ని అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటున్నది నేను... పొద్దున వెళ్లి రాత్రికొచ్చే నీకు ఈ ఇంటిమీదేం అధికారం ఉందనుకుంటున్నావు? అయినా నేను నీలాంటి అన్‌కల్చర్డ్ బ్రూట్‌తో ఇక ఒక క్షణం కూడా కాపురం చెయ్యలేను... నువ్వు గెటౌట్ అని అంత లౌడ్‌గా అరవాల్సిన అవసరం లేదు. నేనే వెళ్లిపోతున్నాను" అంటూనే ఆమె బెడ్‌రూంలో కెళ్లి త్వరత్వరగా సూట్‌కేసు సర్దేసుకుని బయటకు వెళ్లడానికి సిద్ధమైంది.

"బాగా ఆలోచించుకొని బయట కాలుపెట్టు... నువ్వెక్కడకెళ్లినా మళ్లీ నా కాళ్ల దగ్గరకే వస్తావు... మీ అమ్మా, నాన్నలు పరువుగా బతికేవాళ్లు... వాళ్లు నీ కాళ్లూచేతులూ కట్టేసయినా సరే నిన్ను తీసుకొచ్చి మళ్లీ నాకే అప్పగిస్తారు" అన్నాడతడు.

"అది నా కంఠంలో ప్రాణమున్నంతవరకు జరగదు... వాళ్లు నన్ను నీ దగ్గరకు తీసుకురావడం అంటూ జరిగితే నా శవాన్ని తీసుకొస్తారు.. గుడ్‌బై... మిస్టర్ అశోక్‌కుమార్, ఎం.ఎస్‌సి. పి.హెచ్‌డి... గుడ్‌బై" అంటూనే ఆమె తలుపులు తెరచుకొని బయటకు వెళ్లి ధామ్మని శబ్దం చేస్తూ ఆ తలుపుల్ని మూసేసి, చకచకా నడుచుకుంటూ బయట ప్రపంచంలోకి వెళ్లిపోయింది.

■

